## ప్రజల మాట ప్రగతి బాట

## సికింద్రాబాద్ నియోజకవర్గం

# ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం హేయం

**ఓటమి భయంతోనే కాంగ్రెస్ హత్యారాజకీయాలు చేస్తోందని ధ్వజం : ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని విపక్షాలకు హితవు**

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 31: ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి మండిపడ్డారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు, దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి కుట్ర రాజకీయాలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని విపక్షాలకు హితవు పలికారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి రెండు సార్లు ఎంపీగా గెలిచి, మూడోసారి ఎమ్మెల్యేగా బరిలోకి దిగితే దాడి చేయడం హేయమని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిందితులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దోషులు ఏ స్థాయి వారైనా వదలకూడదని కోరారు. కాంగ్రెస్ పార్టీ రక్తచరిత్రతో అనునిత్యం రాష్ట్రాన్ని అల్లకల్లోల పరిచి, ఆర్థికంగా అస్థిరపరిచి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని దుయ్యబట్టారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్న కాంగ్రెస్ పార్టీకి అది అందని ద్రాక్షేనని అర్థమై, నీచ రాజకీయాలకు తెరతీసిందని ధ్వజమెత్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ కుటిల రాజకీయాలు రాష్ట్రాన్ని కబలించకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీని కనుచూపుమేరలో లేకుండా తరిమేసేందుకు ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి

## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పార్టీ నాయకులతో చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

అడ్డగుట్ట, అక్టోబర్ 31 : చిలకలగూడలోని శ్రీదేవి థియేటర్ వద్ద ఎమ్ చంద్రశేఖర్ రావు ప్రజాసేవ వ్యవస్థాపక అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు పార్టీ అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీశ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి దురదృష్టకరం

**శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్**

హిమాయత్‌నగర్, అక్టోబర్31: మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తి దాడి జరగడం దురదృష్టకరమని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజాస్వామ్య సమాజంలో హింసకు స్థానంలేదని,ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఎన్నికల్లో గెలువలేక ఓటమి భయంతో హింసా రాజకీయాలకు పాల్పడే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు.ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## కొత్త ప్రభాకర్‌రెడ్డికి డిప్యూటీ మేయర్ పరామర్శ

హత్యాయత్నానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ప్రభాకర్‌రెడ్డి త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాక్షేత్రంలో నిలువలేక ఇటువంటి దాడులకు ప్రతిపక్షాలు తెగపడడం సరికాదని హితవు పలికారు. – ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 31

**నేడు వారాసిగూడ చౌరస్తా నుంచి**

## పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారం

సికింద్రాబాద్,అక్టోబర్ 31:డిప్యూటీ స్పీకర్,బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి ప్రచార పాదయాత్ర నేడు బుధవారం బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ సీనియర్ నాయకుడు సుంకు రాంచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.నాయకులు,కార్యకర్తలు,పజ్జన్న అభిమానులు పెద్ద ఎత్తున్న హాజరుకావాలని పిలుపునిచ్చారు.వారాసిగూడ చౌరస్తా నుంచి ఉదయం 10 గంటలకు ప్రచార పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

## హత్యా రాజకీయాలు కాంగ్రెస్‌కు తగదు

అడ్డగుట్ట, అక్టోబర్ 31 : ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా అప్రజాస్వామ్యంగా గెలవాలనుకోవడం నీతిమాలిన చర్య అని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ గుండా నాయకులు చేసిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. అడ్డగుట్టలో కార్పొరేటర్ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు భౌతిక దాడులకు దిగుతున్నారని, హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టి విద్య అని ఆమె మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఓటుతో బుద్ధి చెబుతారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, పార్టీశ్రేణులు నక్కమధు, పెండెం మనోహర్, శ్రీనివాస్ గౌడ్, పొన్నాల రాజు, ఎల్లయ్య, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

## టీమ్ సాయిపై హత్యాయత్నం ఎమ్మెల్యే హన్మంతరావు అనుచరుల పనే

**గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్**

ఖైరతాబాద్, అక్టోబర్ 31 : మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం జాతీయ కోశాధికారి పీఎం సాయి ప్రసాద్ గంగపుత్ర అలియాస్ టీమ్ సాయిపై జరిగిన హత్యాయత్నం వెనుక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అనుచరులు ఉన్నారని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు శంకర్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరిలో మైనంపల్లి హన్మంతరావు ఎమ్మెల్యేగా ఉండి చేస్తున్నటువంటి అన్యాయాలు, అక్రమాలు, దాడులు, భూకబ్జాలపై గత కొంత కాలంగా సాయిప్రసాద్ పోరాడుతున్నారని, రాజకీయంగా ఎదుగుతున్న అతడిని తన కుర్చీకి ఎసరు తెస్తాడని అనుమానించి ఆయనపై ఈ దాష్టికానికి ఒడిగట్టాడని విమర్శించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన సాయిప్రసాద్‌పై జరిగిన హత్యను బీసీ సంఘాల నేతలు ఖండించాలన్నారు. రాష్ట్ర డీజీపీ దీనిపై విచారణ జరింపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో గంగపుత్ర చైతన్యసమితి నాయకులు కైరంకొండ నర్సింగ్, మెట్టు ధన్‌రాజ్, సురేశ్, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు సాయినగర్‌లో ఆత్మీయ సమావేశం

మల్కాజిగిరి, అక్టోబర్ 31: బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 2న ఉదయం 10గంటలకు మల్కాజిగిరి సాయినగర్‌లోని లక్ష్మీసాయి గార్డెన్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. సమావేశానికి ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు పాల్గొంటున్నారని అన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం స్ఫూర్తిదాయకం



నారాయణగూడ కేశవ మెమోరియల్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

హిమాయత్‌నగర్,అక్టోబర్31: దేశ సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు మరువలేనివని కేశవ మెమోరియల్‌లో విద్యాసంస్థల సహాయ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌లో ఉన్న పటేల్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి,సత్యరత్న,సునీత,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌లో ఆటోను ఢీకొన్న లారీ

వెంగళరావునగర్, అక్టోబర్ 31:చెత్త డంపింగ్ యార్డ్‌లో అతి వేగంతో దూసుకొచ్చిన లారీ.. ఆటోను ఢీకొనడంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..యూసుఫ్‌గూడ జవహర్ నగర్ కు చెందిన రంగన్న సోమవారం ఉదయం తన భార్య లక్ష్మితో కలిసి సేకరించిన చెత్తను డంప్ చేయడానికి ఆటోతో కృష్ణకాంత్ పార్క్ సమీపంలోని యార్డుకు చేరుకున్నాడు. డంపింగ్ చేస్తున్న క్రమంలో టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి వీరి చెత్త ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు